
# అమ్మతనం

## మెన్నండుపేందర్



"కొడుకును ఎండపొడ పడకుండా పెంచింది. కొడుకు సదువుకు ఉన్న భూములన్నీ అమ్మింది. కన్న కొడుకు కంటే ఎక్కువగా సూస్కుంది. సివరకు మిగిలింది-ఇద్గో గిదే."

జనం చల్లమ్మ గురించి ఒక్క తీరుగా అనుకోసాగారు. కుక్కి మంచంపై కాళ్ళకట్లు తాళ్ళల్లో కలిసిపోయిన చల్లమ్మకు ఆ మాటలు వినబడలేదు. చుట్టూ వున్న వాళ్ళకు, చల్లమ్మ కళ్ళు నిలబడిపోయిన భ్రమ కలిగిస్తున్నాయి. కాని చల్లమ్మకు, తాను మణికట్టు పట్టుకొని నడిపిస్తున్న తన కొడుకు రాజయ్య కనిపిస్తున్నాడు. గతం కండ్ల ముందు కనిపిస్తున్న కొద్దీ చల్లమ్మ చలనం స్థంభించసాగింది.

* * *

చల్లమ్మది అంత ఉన్న సంసారం కాదు. అలా అని అంత పేద సంసారం కాదు. ఒక అరక, రెండు ఎకరాల మెట్ట, అరెకరం తరి ఉన్నాయి. చల్లమ్మ భర్త, అరవయ్య పొద్దస్తమానం వ్యవసాయ పనులు చేసి, చీకటయ్యేసరికి ఇంటికి వచ్చేవాడు. చల్లమ్మ, భర్తతో సమానంగా వ్యవసాయ పనులు చేసేది. ఆకిలూకి, అలుకు జల్లి, వంట చేసి 'చద్ది' కట్టుకొని భర్త దగ్గరకు వెళ్ళేది. ఇద్దరు కలిసి రాబోయే వాన గురించి, వేయబోయే పంటల గురించి మాట్లాడుతూ భోజనం చేసేవారు.

ఒక రోజున చెలక దగ్గరకి ఆలస్యంగా వచ్చిన చల్లమ్మను చూసి, దుక్కి దున్నుతున్న అరవయ్య నాగలి నిలేసి చల్లమ్మ దగ్గరకొచ్చాడు. చల్లమ్మ భర్తను చూస్తూనే దుఃఖం ఆపుకోలేకపోయింది.

"అయ్యా! ఒత్తి పున్నానికి పక్కింటి పీరమ్మ నన్ను అనరాని మాటలంది. గా మాటలు నన్ను బాధ పెట్టలే...సివరగా నన్ను గొడ్డుబోతని తిట్టింది" అంటూ దుఃఖం ఆపుకోలేక కుప్పకూలింది చల్లమ్మ. ఏ రోజు కూడా కంటతడి పెట్టని చల్లమ్మను చూసి, అరవయ్య హృదయం నీళ్ళుగా మారింది. చల్లమ్మను గుండెకు హత్తుకొని ఓదార్పు మాటలెన్నో చెప్పాడు అరవయ్య. ఆమె మనసు బాగా గాయపడ్డదని అరవయ్య గ్రహించాడు. ఎంతకూ ఆమె దుఃఖం తగ్గకపోయేసరికి, ఒక నిర్ణయానికి వచ్చినవాడులా అరవయ్య "మా తమ్ముడు రాజమల్లుగాని

కొడుకు రాజయ్యను పెంచుకుందాం" అన్నాడు.

ఆ మాటలు విన్న చల్లమ్మ కళ్ళు ఆనందాన్ని ప్రకటించాయి.

"వాళ్ళు వప్పుకుంటారయ్యా!" అనుమానంగా ప్రశ్నించింది చల్లమ్మ.

"ఎందుకొప్పకోరే! మనం పరాయోళ్ళమా!" తిరిగి ప్రశ్నించాడు అరవయ్య.

అరవయ్య తమ్ముడు రాజమల్లు తమ కొడుకును దత్తత ఇస్తానికి ఒప్పుకున్నాడు కానీ, ఆయన భార్య అభ్యంతరం పెట్టింది.

చాలా తర్జనభర్జనలు జరిగాక, అరవయ్య తమ్ముడు "మనది పేద సంసారం. గంపెడు పోరగాండ్లు. పెద్ద పోరి ఈడేరి రెండేండ్లయ్యింది. దాని పెండ్లి సెయ్యలేకపోతన్నం. ఎట్ల నెట్టుకొచ్చేది బతుకులె? మన రాజిగాన్ని పెంపకాన్కి ఇద్దాం. ఉత్తగ కాదు గదా! అన్న వదినలు బాగా సూస్కుంటరు. సదువుకు పెట్టుబడి పెడ్తరు. మన దగ్గరైతే కూలికి పంపించాల్సిందే కదా!" సర్ది చెప్పాడు భార్యకు రాజమల్లు. ఆ తర్వాత నలుగురు పెద్దమనుషుల సమక్షంలో అప్పగింతలు పూర్తయ్యాయి.

అది మొదలు. చల్లమ్మకు ఓ కొత్త జీవితం మొదలైంది. ఊర్లోని బాలింతల్ని బ్రతిమాలి చనుబాలు, దొరకనప్పుడు మేకపాలు పట్టిస్తూ, రాజయ్యలో తన జీవితాన్ని చూసుకోసాగింది చల్లమ్మ. రాజయ్య పెరుగుతున్న కొద్దీ ఆమెకు సంతోషం పెరగనారంభించింది.

"మన రాజయ్యకు ఐదేండ్లు వచ్చినయ్. బళ్ళో చేర్పించాల" అని అరవయ్య అంటుంటే చల్లమ్మకు మిన్ను విరిగి మీద పడ్డట్లైంది.


"గదేందయ్యా! రాజయ్యనొదిలి నేనెట్లుండేది?" దిగులు పడింది చల్లమ్మ. మరలా తన మనసులో "రాజయ్య సదువుకోవాల. పెద్ద ఉద్యోగం జెయ్యాల" సర్ది చెప్పుకుంది.

ప్రతి రోజు రాజయ్య మణికట్టు పట్టుకొని, బడికి తీసుకెళ్ళి మధ్యమధ్యలో చద్ది అన్నం తినిపిస్తూ సాయంత్రం వేళ ఇంటికి తీసుకొచ్చేది చల్లమ్మ.

చూస్తుండగానే ఉన్న ఊర్లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయింది రాజయ్యకు. ప్రక్క ఊర్లో హైస్కూలు చదువు చదివించాలని భర్త అంటుంటే చల్లమ్మ మనసు అల్లల్లాడింది.

బడి నుంచి రాగానే కొడుకు అరికాళ్ళు వత్తుతూ, రాజయ్య ఆ రోజు బడిలో ఏం చెప్పారో చెబుతుంటే ఎంతో ఆసక్తితో వినేది చల్లమ్మ.

రాజయ్య చురుకైనవాడు. చదువులో, ఆటల్లో ఫస్టు వచ్చేవాడు.



## కరీనా కోరిక

బాలీవుడ్‌లో పొగరుమోతు హీరోయిన్‌గా పిలవబడుతున్న కరీనాకు తన సోదరి కరిష్మా కపూర్‌లాగే నేషనల్ అవార్డు గెల్చుకోవాలని ఉందిట. కానీ అందుకు తగిన సినిమాల్లో నటించడానికి అవకాశం రావాలిగా అంటోంది. కరీనా నటించిన సినిమాలన్నీ ఫ్లాప్ హీరోయిన్‌గా తప్ప, బెస్ట్ యాక్ట్రెస్‌గా అవార్డు రావడం కష్టం అని బాలీవుడ్ భోగట్టా.

కొడుక్కి మీసకట్టు వచ్చినా చల్లమ్మ, రాజయ్య మణికట్టు పట్టుకొని నడిపించేది. ఊరి జనం తల్లి కొడుకులను ముచ్చటగా చూసేవారు. "రాజయ్య చెయ్యి సగం అరిగిపోయి ఉంటది ఈ పాటికి" అంటూ జనం పరాచికాలు ఆడేవారు.

రాజయ్య ఇంటరు మంచి మార్కులతో పాసై, ఎంసెట్ రాసి, ఇంజనీరింగులో చేరాడు. కొడుకు ఇక ఇంజనీరైనట్లేనని చల్లమ్మ దంపతులు 'అన్నదానం' చేశారు. కొడుకు చదువు పూర్తయ్యేసరికి ఉన్న భూమి చల్లమ్మ అమ్మింది. నమ్ముకున్న భూమిని అమ్ముకోవాల్సి వచ్చెనని చల్లమ్మ దంపతులు ఒకవైపు కుమిలిపోయినా,

"రేపొద్దున మన రాజయ్యకు పెద్ద ఉజ్జోగం వత్తది. కార్లల్ల తిర్గుతడు. గాలి మోటార్ల గూకుంటడు" అని భార్యాభర్తలు ఒకరికొకరు భవిష్యత్తును కల గనేవారు.

అక్కడ రాజయ్య క్రమేణా ఊరును, తను పుట్టి పెరిగిన వాతావరణాన్ని మరచిపోసాగాడు. పట్టణ వాతావరణం ప్రభావంలో మునిగిపోయాడు.

రాజయ్య తన పేరును 'రాజ్'గా మార్చుకోమని తన క్లాసు మేటు 'ఇందు' అనేసరికి రాజయ్యకు తన తల్లిదండ్రులపై కోపం వచ్చింది. 'అలాగే! మార్చుకుంటా' అన్నాడు రాజయ్య.

కాలేజీకి సెలవులు ప్రకటించారు. 'సెలవులకు ఇంటికెళ్ళడం లేదా రాజ్' అని ఓ సాయంత్రం వేళ ఇందు రాజయ్యను అడిగింది. 'లేదు' అని ముక్తసరిగా జవాబిచ్చాడు రాజయ్య. ఇందు రెట్టించి అడిగేసరికి -

"డర్టీ విలేజ్. డర్టీ లైఫ్. డర్టీ పీపుల్. డొక్కు బస్సులో ప్రయాణం చెయ్యాలి. ఒక చోటు దిగి ఆరు కిలోమీటర్లు నడవాలి మా ఊరు చేరాలంటే. నులక మంచం, నల్లులు, దోమలు, పెంటకుప్పలు, మురికి గుంటలు...నా వల్ల కాదు" జుగుప్స కనబరుస్తూ పలికాడు రాజయ్య.

అక్కడ చల్లమ్మ దంపతులు రాజయ్య గురించి కలవరపడసాగారు. కాలం గడవసాగింది.

"పిలగాడి సదువైపోయి రెండు సంవత్సరాలయ్యే! ఇంటికి ఒక్క తేపైనా రాలె" మధనపడసాగారు రాజయ్య తల్లిదండ్రులు.

ఈ మధ్యలో అరవయ్య ఆరోగ్యం బాగా చెడిపోయింది. మనిషి బాగా చిక్కిపోయాడు. అప్పులు పెరిగాయి. చల్లమ్మ కూలినాలి చేస్తూ తిండిగింజలు సంపాదించసాగింది.

ఉన్నట్లుండి రాజయ్య దగ్గర్నుంచి ఓ రోజు ఉత్తరం వచ్చింది. తాను పెళ్ళి చేసుకున్నానని, ఓ కొడుకు కూడా పుట్టాడని, బారసాలకు రమ్మని రాజయ్య ఉత్తరం రాసాడు. ఇది చల్లమ్మ దంపతులకు ఎదురు చూడని వార్త. అది మొదలు అరవయ్య ఆహారం తీసుకోవడం మానేశాడు. ఎప్పుడూ ఆకాశం వైపు చూస్తూ కనిపించేవాడు. చూస్తుండగానే ఓ రోజు రాలిపోయాడు. చల్లమ్మ ఒంటరిదైంది. తన తోడు పోవడంతో చల్లమ్మ మంచాన బడ్డది "కొడుకా! కొడుకా!" అని కొంత కాలం కలవరించింది.

"నా కొడుకు మమ్ముల మరిసిండా! మేం చేదైనమా! మా రాజయ్యేనా గిట్ల సేసింది..." అన్న చల్లమ్మ చివరి మాటలు వినేవారు ఎవరూ లేరు.

చల్లమ్మ కళ్ళు అలాగే తెరచి వున్నాయి. ఎవరి మాటలో చల్లమ్మ చెవుల్లో మార్మోగుతున్నాయి.

"కొడుకుకు ఎండ పొడ పడకుండా పెంచింది. కొడుకు సదువుకు ఉన్న భూములన్నీ అమ్మింది. కన్న కొడుకు కంటే ఎక్కువగా సూస్కుంది. సివరకు మిగిలింది-ఇద్గో గిదే."

"అద్గో కండ్లు మూతబడ్డన్నై. జీవి గంజి పొయ్యాలే" ఎవరో అంటున్నారు.

చల్లమ్మకు తాను మణికట్టు పట్టుకొని నడిపిస్తున్న రాజయ్య కనిపించసాగాడు.

"రా...జ...య్యా..." అని ఆప్యాయంగా, మౌనంగా పిలుచుకుంది చల్లమ్మ.